# బానిసలు

బాపయ్యగారి అల్లుడు, బాపయ్యగారి అల్లుడు - అని ఆ చుట్టుపక్కల వూళ్ళ నుంచి పెళ్ళివిందులు కుడిచిన జనం గొప్పగా చెప్పుకొన్నారు. అంత ఖర్చు పెట్టి, ఆ తాలూకాలో అంతకుముందూ, తర్వాతగూడా కనీ వినీ ఎరగని భారీ ఎత్తులో కూతురు వివాహం జరిపించిన బాపయ్యగార్ని వాళ్ళంతా చెప్పుకోలేదు. ఆ మోతుబరి ఆసామి ఆస్తికంతటికీ వారసురాలైన పెళ్ళికూతురు - సరస్వతిని గురించిగూడా వాళ్లెక్కువ తలచుకోలేదు. అణగి, మణగి, ఒత్తిగిలి, నిగర్విగా నడచుకొనే ఆయన భార్యగూడా వాళ్ళ పొగడ్తల్లోకి రాలేదు. అందరూ - ఆడా, మగా, వృద్ధూ-అంతా-ఆ అబ్బాయిని గురించే. బాపయ్యగారల్లుడు. బాపయ్యగారల్లుడు, ఎంత అదృష్టవంతుడు. అదృష్టమంటే అదృష్టమా? బాపయ్యగారల్లుడుగాదు. కాశీమజిలీ కథల్లో రాజకుమారుడు-ఆ అబ్బాయి.

*　　　*　　　*

పెళ్ళినాటి వింతతోనే ఆ కుఱ్ఱవాణ్ణి గురించిన అనేక కథలు బయలుదేరినై.

బి. ఏ. చదువుతూ, చదువుతూ అమెరికాదేశం వెళ్ళిపోయాట్ట. కాదు లండన్ వెళ్ళాట్ట, యహెఁ-సీమ ఇంగ్లండయితేను. దొరలు తీసి కెళ్ళార్ట. పెద్ద చదువులికా? కిరస్తానంలో కలిసిపోతాడా? దొరసానమ్మను చేబట్టి అక్కడే వుండిపోతాడా! ఏబ్బే, లేదురా, గుంటూరు దగ్గిర పల్లెటూరేగదంటోయ్.

వాళ్ళదిమాత్రం! అమెరికా వెళ్తూ-పెళ్ళానికి ఇంగ్లీషు నేర్పించాలని మామగారికి ఖరారుగారాసి పోయినాట్టగా.

బాపయ్యను ఎవ్వరూ, ఏమీ అడగలేదు. నిజం అబద్ధం నికరంగా తేల్చుకోలేదు. పెద్దవాళ్ళ యిళ్ళల్లో సంగతులు-బైటికి వినబడవులే అని సమాధానం చెప్పుకొన్నారు జనం. ఏది ఏమైతేనేం - బాపయ్యగారింటికి హెస్కూల్లో పనిమానుదలయిన పంతులొకాయన రోజూ వచ్చి-సరస్వతికి పాఠాలుచెప్పి పోతున్నాడు. మరి మొగుడు దొరయితే- పెళ్ళాం దొరసానికావద్దా-అన్నారు. బాపయ్యగారల్లుడిచుట్టూ - అతని చదువు మీద, దర్జాగురించి, స్నేహితులను, దొరసానులను విశేషించి వందలొందల కట్టుకథలు - వర్షాకాలపు గుళ్ళకమ్మ వాగులో గుండు రాళ్ళవలే - కొట్టుకువస్తూన్నై.

పెండ్లయిన సంవత్సరమే సరస్వతి పెద్దమనిషయింది. ఆ అమ్మాయి మొగుడు విదేశాలుపోయి నాలుగేళ్ళు దాటింది. బాపయ్యగారల్లుడు బాపయ్యగారల్లుడు-చుట్టుపక్కల పల్లెటూళ్ళలో నిత్యమూ, ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు కథలు చెప్పుకొంటూనే వున్నారు.

* * *

బాపయ్య గారల్లుడొస్తున్నాడు, వస్తున్నాడని అకస్మాత్తుగా పెద్ద పుకార్లు ఆనోటినుండి ఆనోటికి, ఒక వూరునుండి మరొక వూరికి పాకిపోయినవి.

బొంబాయి బ్యాంకిలో పెద్ద వుద్యోగం అయిందిట. పిల్లను తీసికెళ్తాట్ట. పుకార్లు చెలరేగిన మరునాడో, మూడవనాడో బాపయ్యగారి పందెపు కోడె దూడల్తో సవారీబండి, బ్యాండుమేళం, పురోహితుడు, పాలేళ్ళు, పనివాళ్ళు పెద్ద వుత్సవంగా అక్కడికి ఏడుమైళ్ళ దూరంలో వున్న - చినపాలెం రైలు స్టేషనుకు కదిలిపోయారు. స్టేషను బయట చింత గుబుర్లకింద బండీ, మనుషులు విడిది చేశారు. ఆ చుట్టూయిసిక వేసినా రాలకుండా తిరునాళ్ళ జనం. పెళ్ళినాటి కోలాహలం. పార్సెల్ కోచిబండి సాయంత్రం మూడుగంటలకు గాని వుసూరుమంటూ రాదు. ఇంటివద్ద మంగళ్ళు, చాకళ్ళు తలంట్లకు, సేవలకు - సరస్వతి భర్త రాకకై ఎదురు తెన్నులు కాస్తున్నారు. అదుగో బ్యాండు, యిదుగో బ్యాండు అంటున్నారు వూళ్ళో మిగిలివున్న ఆడంగులు-ఏనోటవిన్నా బాపయ్యగారి అల్లుడు, బాపయ్యగారల్లుడు. బాపయ్యగారు గంటలనుంచీ కోచీవచ్చే దిక్కుగావున్న సిగ్నల్ చెక్క ఎప్పుడు వంగుతుందా అని ప్లాటుఫారం చివర కనిపెట్టి చూస్తున్నాడు.

అంతలోనే నాలుగయింది, కాని పార్శెల్ కోచీజాడ లేదు. ఇంకొంచెం సేపట్లో - కొత్తగా వెలిసిన పొగాకు కంపెనీల రోడ్డుమీద దుమ్ము రేపు కుంటూ, నిండా దుమ్ముపట్టిన జీపుకారొకటి, మనుషుల్ని దూసుకుంటూ స్టేషను ముందునుంచే రివ్వునపోయింది. అడుగో బాపయ్యగారల్లుడు, అడుగో బాపయ్యగారల్లుడు అని ఆ రాజకుమారుణ్ణి గురించి జనం జయజయధ్వానాలు చేశారు. చినపాలెం చరిత్రలో మొన్న మొన్నటి పొగాకు కంపెనీల ప్రొప్రయి టర్లు తప్పితే - నేరుగా హైద్రాబాదు విమానాశ్రయంనుంచీ సొంత కారులో వచ్చిన దర్జావిశేషం - ఎన్నడూ సంభవించి వుండలేదు.

బాపయ్య నమ్మలేదు, కోచి చూడాల్సిందే నన్నాడు. జనం - బాపయ్య గారల్లుడప్పుడే యిల్లు చేరి వుంటాడని ఘోషిస్తున్నారు. ఉహూఁ కోచి చూడాల్సిందే - నన్నాడు మళ్ళీ బాపయ్య. ఇంకో అరగంటలో జనం చాలా మంది యింటిముఖం పట్టారు. వాళ్ళ కెదురుగా నాయుడమ్మ గుర్రబ్బండీ ఆగమేఘాలమీద స్టేషన్ వేపు వస్తోంది. అల్లుడొచ్చాడని బాపయ్య గారికి కబురు వచ్చింది.

*　　　*　　　*

భర్త వచ్చిన మర్నాడే సరస్వతి కాపరానికి బయలుదేరింది. వచ్చిన క్షణంనుంచే ప్రయాణ సన్నాహాలు చేయించాడు. బ్రాహ్మడు ముహూర్తం అన్నాడు. బంధువులు పలకరించి వూరుకొన్నారు. బాపయ్య గారికి నోటి మాట పెగల్లేదు. ఆయన భార్యకు అసలు యీ అబ్బాయి అర్థమే కాలేదు. వచ్చీరావటంతోనే - స్నానంచేసి - నీకెంతవరకు యింగ్లీషొచ్చిందని - సర స్వతిని అడిగాడు. సరస్వతి ఎట్లా సమాధానం చెబుతుంది? ఏమని చెబుతుంది?

తనతోటి రైతుబిడ్డడా ఆ భాషలో మాట్లాడి ఒప్పించటానికి? బాపయ్య చూస్తూ వూరుకొన్నాడు. కూతురు కాపరానికని కొన్న బీరువాలు, కుర్చీలు, పాత్ర సామాగ్రి ఏమీ అక్కర్లేదట. బొంబాయిలో అన్ని వున్నైంట. ఆ రాత్రి సరస్వతి భర్తను చూసింది, కొంచెంసేపు షార్క్‌స్కిన్ తెల్లసూటుమీద ఎర్ర టైకట్టి విప్పేశాడు. అప్పుడే విదేశపు స్టీమర్లనుండి దిగిన యీ దూర తీరాల యువకుణ్ణా తను పెళ్లాడింది?? బాపయ్యా ఆయన భార్యా ముఖాలు చూసుకొన్నారు. తాము దున్నే భూమిలో ప్రతి అంగుళపు మంచి చెడ్డల్నీ, యోగ క్షేమాల్నీ మాట్లాడే రైతు బిడ్డడు గాదే అల్లుడు? కండలు తిరిగి, పెన వేసి చుట్ట కాల్చి, మంగలి అంటిన అరవీశనూనెను తమాయించుకొని, యింటికి

నిండుగా తిరిగి మినప వుండలు, లడ్లు, అరిసెలు, మధురమైన మీగడ పెరుగు తిని హరాయించుకొని - పాలేరు వేసిన పడక కుర్చీలో పడుకొని, బంధు జనాల్తో పిచ్చాపాటీ, వి త్తనాలు, వర్షాలు, పైర్లు, పంటలూ - మాట్లాడే అల్లుడు గాదు - యీ అల్లుడు. చేసిన పదార్థాలన్నీ అట్లాగే మిగిలినై, చలిమిడీలేదు. చట్టు బండలేదు. సరస్వతి జీపులో ముందు సీటులో కూచున్నది. భయంతో ఆ పిల్ల కళ్ళనీళ్ళు గూడా పైకి కనిపించటంలేదు. అల్లుడు స్టీరింగుముందు కూచున్నాడు. మరుక్షణంలో ఆ వీధివీధంతా దుమ్ము మబ్బులో కనిపించలేదు.

అప్పుడే చెప్పాంగదా - ఇల్లటం అల్లుణ్ణి తెచ్చుకోమని? అని బాపయ్య భార్యను అమ్మలక్క లు ఓదార్చబోయారు.

* * *

జీపు నేరుగా హైద్రాబాదు విమానాశ్రయం ముందాగింది. ఎవరో సరస్వతి భర్తలాంటి వాళ్ళే కుర్రవాళ్ళు పెద్దవాళ్ళు సూట్లబూట్లవాళ్లు, కళ్ళ జోళ్ళ వాళ్ళు ఒక అరడజను మంది నవదంపతుల కిద్దరికీ పూలమాలలు వేశారు. చేతికి పూలగుచ్ఛాలిచ్చారు. మరో పదినిమిషాల్లో-విమానం గాలిలోకి ఎగురుతున్నది.

సరస్వతి భర్తకోటు గట్టిగా లంకించుకొని "నాకు భయం" అన్నది. పొంగి వస్తున్న ఏడుపును అతికష్టంగా ఆపుకొన్నది. అతనన్నాడు- "ఏం భయంలేదు. ఇంతమందికిలేని భయం నీకెందుకు?"

సరస్వతి-జీవితంలో రెండుసార్లే రైలెక్కింది. ఒకసారి వాళ్ళ పిన్నమ్మను గుంటూరు ఆస్పత్రిలో చేర్చినప్పుడు. ఇంకోసారి- శేషయ్యబాబాయిగారి నిర్మల పెళ్ళికి. సరస్వతికి భర్త సమాధానం అర్థంకాలేదు.

బొంబాయి విమానాశ్రయానికి పెద్ద కారొచ్చింది. వాంతిచేసుకోబోయి సరస్వతి ఆపుకొన్నది. డ్రైవరూ యింకా కొందరూ భర్తకు భయ భక్తుల్తో సలాములు చేశారు. ఇంకో గంటలో పెద్దమేడ ముందు లిఫ్టుపక్కనే కారాగింది. లిఫ్టురివ్వన పైకి లేచింది. తివాసీలు పరిచిన యింట్లో ప్రవేశింపజేస్తూ— సరస్వతితో అతనన్నాడు- "ఇదే మనయిల్లు". వంట గదిలోకి పోయి యిందాకటి నుంచి అణిచి పెట్టివున్న వాంతిని భళ్ళున కక్కేసింది సరస్వతి. అతను టెలిఫోన్‌లో మాట్లాడాడు. మరునిమిషంలో లిఫ్టు చప్పుడైంది. తోలుసంచీ పట్టుకొని డాక్టరు గదిలో ప్రవేశించి, సరస్వతిని పరీక్ష జేశాడు. తెల్ల బిళ్ళ యిచ్చాడు. వేడిపాలు తాగించారు. ఓగంట విశ్రాంతితో అమ్మాయి కోలుకొం

టుందని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు. సరస్వతి గర్వంతో, భయంతో, భక్తితో భర్తవంక చూసింది. ఆ అమ్మాయికి ఏడుపొచ్చింది. "అతను" అర్థం కాని మనిషి, గుంటూరు మెట్టపూళ్ళ పొగాకు పొలాల్లో తిరిగిన ఒకనాటి రైతు యువకుడా యితను? కాదు. ఇతడు విదేశీ, దూరతీరాలవాసి. ఆవులు గేదెలు, దూడలు,పాడిపంటలు, తెలుగు సినిమాలు, ఆయుర్వేద వైద్యుడూ, చెరువు కట్ట మీది గుమ్మడి పాదులు, కట్నాల పెళ్ళిళ్ళు,గుంటూరుపట్నంలో విశేషాలు-యీ భాష అర్థమవుతుందాయితనికి? కాదు. కాదు. ఈ యింటి కుర్చీలు, బొమ్మలు, పడమటిల్లు, మెట్లు, నీళ్ళ—తను పుట్టి మెట్టిన యింట్లోలాగా లేవు. ఏదో కొత్తలోకం. ఇది స్వదేశం గాదు. విదేశం. సరస్వతికి కునుకు పట్టలేదు. ఏమిటి? లాగూ చొక్కా వేసుకొన్న-యీ నల్లటి బొట్లరా- తమకు భోజనం వడ్డించేది. సరస్వతికి ఈ కొత్త వంటలు రుచించలేదు. రేడియోలో తెలుగు పాటలు రాలేదు. తన చీరెల్ని చూశా పనిమనిషి-హిందీ పనిమనిషి ముసి ముసి నవ్వులు నవ్వింది? ఎవ్వరూ కట్టని విలువైన చీరలు తనకు పెట్టెనిండా కొనిచ్చిన నాన్నకా ఈ వెలితి నవ్వూ, అవమానం తగిలేది?

* * *

ఆమర్నాడు పదిగంటలకల్లా యిల్లు బయలు దేరిపోతూ- "పదకొండు గంటలకి మేడంఇర్నీ వస్తుంది" అని చేయూపి చిరునవ్వుతో అతను వెళ్ళిపోయాడు. సరస్వతి ఫ్లాట్ కిటికిగుండా, కర్టెన్ తొలగించి చూసింది. మొన్న వచ్చిన కారుకన్నా పెద్ద కారు. తెలుపూ, ఎరుపూ రంగు సూటుతో డ్రైవరు. ఆయన తెరిచివున్న తలుపుగుండా కార్లో కూచోగానే డ్రైవర్ సాల్యూట్ చేయటం, ఒక్క అతని చూపుడువేలు సౌంజ్ఞతో డ్రైవరు కారునడపటం- దేశమంతా పెద్దా చిన్నా లేకుండా విపరీతమైపోతున్నదని నాన్నవాపోయే యీ రోజుల్లో- ఎక్కడిదీ శక్తి తన భర్తకు? సరస్వతికి అర్థం కాలేదు.

అర్థంకాక కిటికీనుంచి వెనుదిరిగి చూసింది. బొట్లరు వచ్చి "మాడం ఇర్నీ మాడమ్" అని వెళ్ళిపోయాడు. అతని వెనకనే మేడం యిర్నీ, బ్యూటీ స్పెషలిస్టు.

"గుడ్ మార్నింగ్ మాడమ్, వాట్ ఎ ఫైన్ బంచ్ ఆఫ్ లవ్‌లీ లాక్స్?! ఐ షల్ గివ్ యు ఎ వండర్‌ఫుల్ బాబింగ్, ఎ ఫ్రెంచ్ వన్—విత్ దిజ్ డివైన్ లాక్స్."

సరస్వతి, వణుకుతూ చూస్తూ నుంచుండిపోయింది. తనకు ట్యూషన్ చెప్పిన పంతులు, కలోక్వియల్ యింగ్లీషు పాఠాలు చెప్పమని పుత్తరు వయింది

గనక, వాటీజ్ యువర్ నేం? హౌ ఓల్డ్ ఆర్ యు? హేవ్ యు ఫినిష్డ్ బ్రేక్ ఫాస్ట్? డు యు టేక్ రెష్ట్ ఆఫ్టర్ డిన్నర్? లాంటి ఏ ప్రశ్న అడిగినా నిండు వాక్యంతో జవాబుండాలట. మై నేం యీజ్ వై సరస్వతి అనాలిట- అని చెప్పాడే గాని యీ దొరసాని యింగ్లీషులో ఒకముక్క గూడా చెప్పిన పాపాన పోలేదు. ఏమైతేనేం సరస్వతి పెద్ద వాలుజడ పోయింది.బాబ్డ్ క్రాప్ వచ్చింది. అతను సాయంత్రం వచ్చి చూసి తృప్తిగా చిరునవ్వు నవ్వి—మేడం యిర్నీ పంపించిన బిల్లు ఆ పిల్లచేతిలో వుంచి—"నీదేగా, ఇచ్చుకో" అని నవ్వేశాడు. సరస్వతి బావురుమని ఏడ్చింది. సరస్వతికి అందానికి కరువులేదు. అందమూ, ఆరోగ్యమూవున్న పిల్ల. ఈబాబింగ్ తెచ్చిన కొత్త అందం అతనికే అర్థం కావాలి, ఆ పిల్లకు కాలేదు.

"ఎందుకు, ఎందు కేడుస్తావ్?"

ట్రేలో టీ, బిస్కత్తులు తెస్తున్న బొట్లరు వెనుదిరిగి పోయాడు.

సరస్వతి పమిటెచెంగు ముఖానికి కప్పుకొంటూ- "మా అమ్మ రోజూ తులసెమ్మకు నమస్కరించమని చెప్పింది" అని ఇంకొంచెం పెద్దగా ఏడ్చింది.

"ఎవరా తులసెమ్మగారు? ఎక్కడుందావిడె."

"తులసి కో....ట"

"ఓహో! తులసిపూజా-చేసుకో, ఎవరొద్దన్నారు? దానికి ఏడవట మెందుకు?"

"నా...జుట్టు"

"ఏం ఇప్పుడొచ్చిన అడ్డేముంది. ఇట్లా అయితే లాభం లేదు. యిక్కడిట్లాగే వుండాలి. ఏడిస్తే ఏం లాభం? ఆలోచించు-అందర్నీ చూడు. నేను బ్యాంకి మేనేజర్ని. నువ్వు నా భార్యవు. నేను నీ భర్తను. అర్థమైందా?"

పమిటచెంగు తీసి భయపడుతూ సరస్వతి అతనివంక, ఆ కళ్ళల్లోకి చూసింది. ఏమీ అర్థంకాని కళ్ళు.

"లేచి తయారవ్వు. ఇవ్వాళ మనమొక పెద్ద పార్టీకి పోతున్నాం. వచ్చే వారం-మనమూ పెద్ద హౌస్ వామింగ్ పార్టీ ఇస్తున్నాం. క్లబ్బులో అరేంజి చేశానన్నీ."

సరస్వతి తనకర్థంగాని యింద్రలోకంలో విహరిస్తున్నది. మలబార్ హిల్ మీదా, మెరీన్ డ్రైవ్‌లోనూ, సరస్వతి తనకర్థంగాని భాషలో మాట్లాడుతున్నది. దొరలు, కార్లు, పెద్ద పార్టీలు, డబ్బంటే లక్ష్యంలేని షమనులూ,

మన పోలికలే లేని పార్కులు, బ్యాంకులు, భవనాలు, జనసందోహాలు. ఈ ఐశ్వర్యంలో యీ కొత్త లోకంలో యింకో పిల్లలు ఎవరైనా యిట్టే యిమిడి పోయి వుండేవారు; కాని సరస్వతి వీటి నర్ధంచేసుకోలేదు. చినపాలెం పోస్టు ముద్రతో వున్న నాన్నగారి వుత్తరాన్ని యిరవై సార్లు చదువుకొన్నది. అమ్మను వందసార్లు తలచుకొన్నది. చినపాలెం చెరువుమీది స్వేచ్ఛావాయువు కోసం వాచిపోయింది. సావడ్లో పందెపుకోడెల మువ్వలకోసం కలలుగన్నది. అమ్మ చేతి వంటకోసం ముఖం మొత్తుకొన్నది. తనవంటి వాళ్ళకోసం చుట్టూ కలియ జూసుకొన్నది. కాని "అతనే" అర్థం కాలేదు. ఇంకా "విదేశీ" అయిపో తున్నాడు. సరస్వతికి జ్వరం పట్టుకొన్నది. మంచం ఎక్కింది. డాక్టరు ఒకరు గాదు. యిద్దరుగాదు, ముగ్గురొచ్చి చూశారు. ప్రైవేటు నర్సు వచ్చి రాత్రింబ వళ్ళు కనిపెట్టుకుని తన మంచం పక్కనే కూచుంటున్నది. సరస్వతి జ్వరం తగ్గలేదు.

అతను దయగలవాడు. కాని తనకు అర్థంకాని దయ అది. చెంపలు తాకి చూశాడు. తీరినప్పుడల్లా తనమంచం మీదవచ్చి కూర్చొనేవాడు.

"మీ అమ్మనూ, నాన్నను పిలిపించనా?"

సరస్వతి ఆశ్చర్యంగా అతన్నిచూసింది. ఎన్నాళ్ళనుండో తెద్దామనుకొన్న ప్రసంగం, గొంతులోనే మూగగా బాధగా దాగివున్న ఆత్మీయ మైనప్రశ్నలు యీనాడు చేయటానికి, వేయటానికి మహదవకాశం దొరికింది.

"కాదు, మనమే అక్కడికి పోదాం"

"నేనెట్లా రాగలను? బ్యాంకి మేనేజరంటే ఎంత బాధ్యత? అయినా నువ్వు మాత్రం అక్కడికెందుకు? ఆస్పత్రా? డాక్టరా? పాడా? నీ కిక్కడేం తరుగొచ్చింది?"

సరస్వతి చెయ్యి అతని కాలరు దాకా పోయింది. అతని కాలరు సవి రించింది. కంటినీరు బుగ్గలమీదుగా జారిపోతుంటే, అతనే తుడిచాడు.

"ఏమిటోచెప్పు" అన్నాడు.

తనంటే యిష్టంలేని వాడైతే - యింతమంది డాక్టర్లను పెట్టి యింత ఖర్చెందుకు చేస్తాడు? ఏ పార్శీ పిల్లనో, ఏ యింగ్లీషు పిల్లనో కట్టుకొని వూరేగుతూ వుండడా? అతని హృదయంలో ఏముందో ఎట్లా అర్థమవుతుంది, తను మాట్లాడకుండా వూరుకుంటే, యిదే అదనుగా సరస్వతి నోరువిప్పింది.

"మీకర్థం కావటంలేదా? నాకిక్కడుంటే నయంగాదు."

"ఎందుకుగాదు. నేనులేనాః"

ఆమె మళ్ళీ అతని కళ్ళల్లోకి చూసింది. ఈకళ్ళు, చూపూ విదేశీ చూపులు గావు. తమ పెళ్ళినాటివి. పాతవి. తనిదివరలో చూసినవి. మధుర మైన బాధలను పెట్టినవి. అతనింకా చెప్పుకు పోతున్నాడు:

"నా ఈడువాళ్ళంతా బ్యాంకీల్లో గుమాస్తాలుగా మగ్గుతున్నారు. యింకా పెద్ద చదువులు చదివినవాళ్ళు గూడా; ఏదో అదృష్టం, నీదేనేమో బహుశ, నాకు పట్టింది. వాళ్ళంతట వాళ్ళే విదేశాలు పంపించారు. గవర్నర్ జీతం యిస్తున్నారు. యీ బ్యాంకికి కళ్ళూ, గుండెకాయా, ఆత్మా అన్నీ నన్నే కమ్మ న్నారు. అయినాను. వెయ్యి బాధ్యతలు తీసుకోమన్నారు. తీసుకొన్నాను. వీటన్నింటినీ క్షణంలో గాదు సంవత్సరాలైనా వదల్లేను. ఎట్లా వచ్చేదిః"

"మనకక్కడ బోలెడంత ఆస్తి వుంది. అదంతా ఎవరు తినాలి- మీరూ నేనూ కాకపోతే. మనదేశంలో వుంటే ఎంత ఆనందంః ఈ మనుషుల్లో యీ దేశంలో ఎట్లా వుంటారు జీవితమంతాః"

ఈ కొద్దినెలల్లో యింత వేదాంతం నేర్చుకొన్నది సరస్వతి. అతను ఫక్కున నవ్వేశాడు.

"ఓ అదా, నేనూ నీ లాగానే, సరసూ, పల్లెటూరి బాలుణ్ణే. నా హృదయం అక్కడే వుంది. నా తోడునీడవు నువ్విక్కడున్నావ్. నువ్వే నా పల్లెటూరు. నీ హృదయంలో నేను దాక్కోగలను. అదే నా శాంతి వెనక రహస్యం"

సరస్వతి ఆనందం పట్టలేక మళ్ళీ ఏడ్చింది.

"సరసూ, మనమంతా యీ కొత్త నాగరికతకు బానిసలం. దీన్నుండి పారిపోలేం. పోయినా యిది వదలని రాక్షస నాగరికత. అందుకని యిందు లోనే యిమిడిపోదాం. సరే- రేపే నీ ప్రయాణం. ఓ నాలుగు నెల్లు మీ వూరి గాలిపీల్చి నోములు నోచుకొని వద్దువుగాని."

"నేనుపోను, యీ జుట్టుతో పోను."

కాదు కూడదన్నాడు. రాజు తలచుకొంటే దెబ్బలకు కొదవాః గంట న్నరలో సరస్వతి హైద్రాబాదు ఎగిరి పోయింది. అక్కడ్నించి కారు. పుట్టి మెట్టిన చిరపరిచితమైన వూరు జేరింది- స్వేచ్ఛా వాయువుకోసం-ఆ సాయం త్రమే.

* * *

అయితే సరస్వతి-భర్తను అర్థం చేసుకొన్న కళ్ళతో స్వగ్రామం తిరిగి వచ్చిన సరస్వతి-వచ్చిన రెండో వారంలోనే భర్తకు టెలిగ్రాం యిచ్చింది. "నాకేమీ తోచటంలేదు. ఒక్క క్షణం వుండలేను. తిరిగి వస్తున్నాను. హైద్రాబాద్ రండి."

హైద్రాబాద్‌లో అతను కలిసి సరస్వతి బుగ్గల్నినొక్కి దిగులూ, సంతోషమూ మిళితంచేసి అన్నాడు - "సరసూ, నువ్వూ యీనాటి నుంచీ యీ నాగరికతకు బానిసవై పోయావన్నమాట."

(ఆంధ్ర దినపత్రిక : 30 మార్చి 1958)

# రాగమ్ నీలాంబరి

"ఎన్నమాన్! సాపాడ్ తిన్లేదు క్యా?"

తమిళం, ఆంగ్లం, తెలుగు, హిందూస్థానీల్లో కలగాపులగం ప్రశ్న. టాపులేని పాత చెవర్లెట్ కారులో ఎర్రగా కందగడ్డలాంటి ముఖం తొంగి చూస్తున్నది. ఇంజన్ నడుస్తూనే వున్నది. ఆ ప్రశ్నలాగానే ఇంజన్ శబ్దం గూడా స్వల్పంగా 'టిప్సీ' - ముద్ద ముద్దగా.

రైల్వే కాలనీ మలుపులో పాడుబడ్డ పీర్ల సావిడి చవిటి గోడకు వీపు ఆనించి, మోకాళ్ళ ముడుకుల మీద శిరసు వంచుకొని అంతర్ నిర్వాణంలో వున్న ఆ యువకుణ్ణి మూడు దినాల నుండి - గమనిస్తున్నాడు సిగ్నల్ ఇన్స్పెక్టరు హొవార్డు దొర. ఆంగ్లో ఇండియన్.

మూడు దినాల ఆకలి. మూడు దినాలే అయినా మూడు యుగాలనిపిస్తున్న నిశ్శబ్దంలో నరమానవుడెవరూ తనను పలకరించలేదు దుఃఖాన్ని త్రాసులో తూస్తున్నాడనిపించే సమాధి స్థితి. కాని అతనిని ఆవరించింది దుఃఖం కాదు. నిస్త్రాణ. బాల్యంలో తాతగారు - ఏ క్లేశంలో వున్నా ఓమ్ మంత్రం అనే ప్రణవ నాదాన్ని జపించమని చెప్పిన నీతిని ఆచరించాడేమో - పదిసార్లు వుచ్చరించేసరికి కమ్ముకున్న నిస్త్రాణ. చెవులు దిబ్బెళ్ళుపడి, పాట - ఏదో పాట - వినిపిస్తూంటే సమాధిలోకి జారిపోయాడు. అతని ఆకలి అనుభవాల్లో

ఆదొక శుభ సంకేతం - ఈ పాట. దాని తర్వాత ఏదో ఒక లీల, ఒక మిరకిల్ సంభవించటం తథ్యం.

వేణు - కారు తన ముందాగటం వినలేదు. ప్రశ్ననూ సొంతం అర్థం చేసుకోలేదు. సాపాడు - అన్న పదం తన హృదిలో వినిపిస్తున్న పాటతో మిశితమై అంతర్గత జఠర రసగ్రంధుల్ని కదిలించిందేమో తలెత్తి చూశాడు. అడుగో ప్రతీహారి! మానవతా ప్రతీహారి! లీల! మిరకిల్. ప్రతి వస్తు పిదప, ప్రతి నిరీక్షణ తర్వాత,ప్రతి ప్రార్థనానంతరం - ఒక లీల.

సాపాడు తినలేదన్నట్లుగా తల వూపాడు.

"కమాన్ జంపిన్ మాన్!" (కార్లోకి రావోయ్)

వేణు చొక్కా దులుపుకుంటూ హొవార్డు దొర సరసనే కూర్చున్నాడు కార్లో. వెనక సీట్లో జిన్, రమ్, వైన్ సీసాల జాజిచెక్కల పెట్టెలు. పక్కనే నౌకరు సంపంగి. చెవర్లెట్ కారు రైల్వే అధికారుల క్లబ్బు ముందు నిలిచి పోయింది.

క్లబ్బులో అతనికి మొదట సాక్షాత్కరించినవి రంగు రంగుల చైనీస్ పేపరు తోరణాలు. ఇంగ్లీషులో స్వాగతాక్షరాలు. సరిగా భోధపడలేదు. బిలియర్డ్స్ గదిలో లిక్కర్ సీసాలు అమరుస్తున్నారు. చీట్లపేక గదిలో బల్లలన్నీ సర్ది వున్నాయ్. బఫే డిన్నర్ ఏర్పాట్లు. మధ్యనున్న బ్రహ్మాండమైన హాలులో డాన్స్ కాబోలు - తివాసీలు పరుస్తున్నారు.

నౌకరు సంపంగి పింగాణీ డేక్చాలో వేడి వేడి సూపు తెచ్చి యిచ్చాడు. పైన తేలుతున్న మాంసపు చిన్న, చిన్న ముక్కల్ని తోసేస్తూ వేణు రెండు పెద్ద చెంచాలు సేవించాడు. ప్రాణం తేరుకొన్నది. లోకమంతా రంగుల హరి విల్లులాగా కన్పించుతున్నది. మళ్ళీ యింకేదో నేపథ్య గానం.

"ఐ నో ఈట్ మటన్" - అన్నాడు సంపెంగితో. తనకంత వరకే ఇంగ్లీషు భాషతో పరిచయం.

నౌకరు అతని చేతిలో సూపు ప్లేటు తీసుకొని ఆవిర్లు తేలుతున్న అన్నం పళ్ళెంలో పుల్లిపాయల సాంబారుతో తిరిగి ప్రత్యక్షమైనాడు. బయట చీకటి పడుతున్నట్లుంది. లైట్లు గుప్పున వెలిగాయి.

ఈ ఆంగ్లో ఇండియన్లు అల్ప సంతోషులు. పండక్కీ పబ్బానికీ విలువ తెలియకుండా డబ్బు ఖర్చు చేస్తారు. హొవార్డ్ దొర కూతురు సిసీలియా నిశ్చితార్థం (ఎంగేజిమెంటు) ఆ రోజు. పైపెచ్చు ఆయనదీ, ఆయన భార్య

బార్బరాది- పదేళ్ళ కొడుకు అలెగ్జాండరుదీ- విచిత్రంగా పుట్టినరోజు వుత్సవం. హేపీ బర్త్ డే. ఒకటి కాదు - మూడు, ఒకే ముహూర్తంలో.

వేణుకు ఆవలింతలొచ్చినై. కడుపులో గానం. మదిలో గానం. హృదిలో గానం. తాతగారు నేర్పిన స్తోత్రం-అన్నదాతా సుఖీభవ-అనుకొంటూ ఆ మూల తివాసీ మీద వరిగిపోయాడు. ఒక మహదోంకార దివ్య నినాదం, తన మనుష్య గుహా ముఖాన వర్షిస్తున్నట్లుగా వున్నది, సుషుప్తిలో స్వప్నాలు. అయితే తను బిచ్చగాడు కాదు, పిచ్చివాడూ కాదు. ఈ అన్నదాతకు ప్రత్యుపకారం కోసమే ఆ కలలు.

బమ్--బమ్-- అని బాంజో మోత. డ్రమ్ములు. వేణుకు మెలకువ వచ్చే సరికి పియానో పలుకులు. హాలు విండా దొరలు, దొరసానులు. నయనానంద కరంగా రంగుల దుస్తులు. చప్పట్లు చరుస్తూ దొరలు దొరసానులూ హేపీ బర్త్‌డే పాటలు పాడుతున్నారు. తనకు వళ్లు తూలుతున్నా. ఆ స్పందనలో, ఆనందంలో మమేకమై చప్పట్లు చరుస్తున్నాడు. ఒక గంట క్రితమేనా- తనది విషాద మురళివేళ? ఇప్పుడో- వసంత నృత్యవేళ. ఈ దొరలు నును తామరాకు మీద తేలే నీటి ముత్యాలు కావచ్చు. తను మాత్రం యీ జీవన కేళిలో అగమ విపిన మయూరివలె మారిపోయాడు. ఇంగ్లీషు పాటలు సోల్జర్లు కవాతుల పాటలు. తనలో గాంధారం. అంతర గాంధారం.

వేణు జ్ఞాపకాలు గతంలోకి జారబడి తన చిన్ననాటి తన పుట్టినరోజు వేడుకలు, దృశ్య దృశ్యాలుగా, అన్ని వాయులీనాల మధ్య దర్శనమిస్తున్నాయి. తనూ, తాతగారూ, అమ్మా, నాన్నా - గుళ్లో సహస్రనామావళి పూజ. ఇంటి ముందు పందిరి. తన తల మీద భోగిపళ్ళ దశ నుండి- పుష్పవర్షాల వయసు. పూలతో కలిపి రాణీ మార్కు రూపాయలు- కాసులు. నాన్నగారి ఐశ్వర్యం. బృందావనం రంగాచార్యులు గారి పంచరత్నాలు. అప్పయ్యశాస్త్రిగారి శాంతి వచనాలు. రాత్రి నాన్నగారి నాటకాల్లో వేషాలు వేసే మహానటులకు, నటీ మణులకు విందు. వెండి గ్లాసులు, గిన్నెలు, పెందోట వెంకటరత్నం వెండి దుకాణమంతా యింట్లోనే. ఎన్ని బహుమతులని చెప్పుకోవాలి? తాతగారు - ధారణశక్తిలో క్రమం, జటా, ఘనా-కించి త్తయినా తప్పులేకుండా వేదపఠనం చేసిన ఘనాపాటీలకు, కాళ్ళు మొక్కించి, శాలువలు, గుండు చెంబులు తన చేత యిప్పించటం. కవి సమ్మేళనంలో ఏయే స్వేచ్ఛాగానాలు, ప్రణయగీతాలు భక్తి రాగాలు, గిరజాల కవుల దుఃఖ ద్విపదలు - వినలేదు గనక. గతమంతా

స్వప్నమా? తన జీవితమే యాదృచ్ఛిక సంఘటనా? నాటకాల పద్యాల్లో, కీర్తనల్లో తాతగారి భక్తి కృతుల్లో, శతక ప్రతిధ్వనుల్లో - యీ గాంధార విద్య, గురువులు లేకుండా తనకబ్బింది. అందువల్ల - యీ యింగ్లీషు పాటలు తనకబ్బురం, ఆశ్చర్యం అనిపించటం లేదు. తన జీవితమే అందులో భాగంగా పెరిగినప్పుడు యీ సంగీతం తన రక్త కణాలయి, యోగలీలగా మారినపుడు జీవనానందం, మళ్ళీ విరిగిపోయిన ఐశ్వర్యాన్ని ఓడిపోయి వదలిపోయిన గతాన్ని - ఎందుకు స్మృతికి తెచ్చుకొంటున్నది? వేణు చప్పట్లేగాదు, నృత్యంలో గూడా జోరబడ్డాడు.

ఐర్లాండు దొర, దొరసాని పాడ్తూన్న పాట ముగిసింది. హాలంతా నిశ్శబ్దాన్ని ఆహ్వానిస్తున్నట్లుగా. వేణు గబగబా హొవార్డు దొర దగ్గిరికి దూసుకుపోయాడు.

"సార్, నేనొక పాట పాడుతాను" అన్నాడు.

దొర ఆనంద సాగరంలో, తెల్ల షర్టు, నల్ల బౌటై. నల్ల ప్యాంటు, డిన్నర్ సూటులో, తనని చిరునవ్వుతో చూసి "గో ఎహెడ్ మాన్!" (మంచిది, వెంటనే పాడు) అన్నాడు.

అప్పుడు పాడాడు- ఉయ్యాల సేవ పాట- నీలాంబరి రాగంలో. మృదువుగా, గంభీరంగా, లవుకికంగా సప్త స్వరాల సమ్మిశ్రితంగా, పల్లవి, అనుపల్లవి, చరణం. తనను తను మరిచిపోయి, చిట్టి స్వరం, సంగతులు, స్వరాక్షరాలు; మూడుదినాల వుపవాస దీక్ష తర్వాత. అంతర్ నిర్వాణాన్ని ఛేదిస్తున్న శబ్దస్తోత్రం. తర్వాత తనకు తెలియదు. చప్పట్లతో హాలంతా ప్రతిధ్వనిస్తున్నది. తనూ, తన మాసిన బట్టలు, అన్ని విద్యుద్దీపాలు తనపై కేంద్రీకరించుకొని. అయితే అది హాపీ బర్త్‌డేపాట. తాతగారు మెచ్చే వేద, వేదాశీర్వచనం లాగా- ఆ రాగం.

భుజాలు తడ్తున్నారు. వీపు చరుస్తున్నారు. హొవార్డుదొరవైన్ వాసన వుచ్ఛ్వాస నిశ్వాసాల్తో మాటలు.

"వెల్ డన్ మాన్, కీప్ దిస్-జేబులో చేతిని జొనిపి,-కీప్ దిస్ టెన్నర్" (ఈ పది రూపాయలుంచుకో) అంటున్నాడు. కాని అది వంద రూపాయల పెద్ద నోటు.

"సార్...బిగ్ మనీ దిస్..." ఎనిమిదో క్లాసుతోనే అంతమైన తన ఆంగ్ల విద్యతో నోటును చూపిస్తున్నాడు.

## 2

వేణు బడినుంచి యింటికి వచ్చేసరికి నాన్నగారు నిదురగన్నేరు వలే నిదురిస్తున్నాడు శాంతంగా. ఎక్కడ? గృహప్రాంగణంలో, వరండా ముంగిట కటికనేల మీద. ఎండు గడ్డి పరుపుగా. చుట్టూ జనం మూగివున్నారు. శిరస్సు వద్ద మట్టి ప్రమిదెలో దీపం. మౌనపూజలో తండ్రి పాదాల సన్నిధిలో అమ్మ కనిపించింది. "అంతా అయిపోయిందిరా నా తండ్రీ!" అని తనను కౌగలించు కొని విలపిస్తున్నది.

అరగంట క్రితమే తను బళ్ళో అమ్మేశ్వరావు మాష్టారు పాఠం చెబు తుంటే శ్రద్ధగా వింటున్నాడు. అమ్మేశ్వరావు మాష్టారు నాన్నగారి కంపెనీ నాటకాల్లో వికర్ణుడు, నకులుడు వేషాలు వేస్తూంటాడు. చక్కని పద్య పఠనం. ఇంతలో బడిగది వాకిట్లో శివయ్య కన్పించి మాష్టారుతో ఏదో చెబుతున్నాడు. ఆయన చేతిలో డస్టరు నేలమీద పడింది. "మీ చుట్టాలెవరో వచ్చారు. ఇంటి కెళ్ళిపో వేణూ" అని గద్గద స్వరంతో అన్నాడు. తనకు అనుమానం. దారిలో గూడా శివయ్య ఏమీ చెప్పలేదు. తన పుస్తకాల సంచీ పట్టుకోటమే కాకుండా, తన కుడిచేతి వేలునూ తన చేతిలోకి తీసుకొన్నాడు. ఈ శివయ్య నాటకాల కంపెనీలో వంటలు చేస్తూండేవాడు. ప్రతీసారి, రాజభటుడు వేషాలు వేసేవాడు. పెద్ద నటులను అనుకరిస్తూ పాటలు పద్యాలు పాడుతూ ఆనందిస్తూండేవాడు. నాన్నగారి కళాధర్ హాలు మూతబడి మూడేళ్ళయినా, నాన్నచుట్టూ తిరుగుతూనే వున్నాడు. ఎవరేది కోరితే, ఆ వంటకం రుచిగా చేసిపెట్టే రోజులు గతించినవని అనుకోడమే, పాపం. శివయ్యమీద తనకు కోపం రాలేదు.

ఆ పేట ప్రజలందరూ వస్తూన్నారు, పోతున్నారు. పాత స్నేహితులు, నాటకాల వాళ్ళు, కొందరు దూరపు బంధువులు. కాని నాన్నగారి శవం లేవటం లేదని వేణు తన అభిమాన ఆసనంలో మోకాళ్ళ మీద తలవంచి ఆలోచిస్తు న్నాడు. ఉదయం- కాళిదాసుగారి కార్లో బాపట్లనుంచి వచ్చిన ప్రాణ రహిత శరీరం.

సరిగ్గా సాయంత్రం నాలుగ్గంటలకు జట్కా-బండి వచ్చి ఇంటిముందు నిలిచింది. అందులోంచి ఒక ప్రౌఢ వనిత, ఆమె వెంట ఒక బాలిక- తనకన్నా నాలుగైదేళ్ళు చిన్నదేమో- దిగి లోనికి వచ్చారు. తలమీద ముసుగు- కొంచెం చామన చాయేమోగాని, అపురూప సౌందర్యవతి అనిపించింది. నాన్నగారి కాళ్ళను కళ్ళకద్దుకొన్నది. శవదీపానికి నమస్కరించింది. అమ్మవద్దకు

వచ్చింది. ఏదో మాట్లాడబోయింది. అమ్మ ముభావంగా వున్నది. ప్రతిస్పందన శోకంలేదు. మూగి వున్న గుంపులో గుస గుసలు. "హనుమాయి - - - హనుమాయి" - "ఆయన వుంచుకొన్నామె", "ఏమి నటించేది?".

అకాశాతత్పతిత తోయం వలె - ఆమె కన్నీరు, అదీ గమనించాడు. ఎవరి కన్నీటి వుపనదిగానో, ఎవరి అంతరచిర హృదయ సఖిగానో, తన హృదయ విషాదాంతాన్ని ఎవరికయి నివేదించగలనా అని ఎప్పుడూ దీనంగా దృక్కులు పరుపుతూ క్షణం అచేతనంగా నిలిచింది. ఈమేనా - హనుమాయి, తను చూసిన విప్రనారాయణ నాటకంలో దేవదేవి? ఒకేసారి విన్న ఆమె రంగనాధుని వుయ్యాల సేవ పాట, తనకు కంఠతా వచ్చిన నీలాంబరి రాగ మాధురి ... యీామెదేనా? ఆమె కూతురు కాబోలు - ఆ పాపను తలమీద నిమిరి కళ్ళతో సంభాషించింది. పాప గూడా, తన శరీరాన్ని రెండు చేతులుగా మార్చి నాన్నగారి పాదాలకు నమస్కరిస్తున్నది. అప్పటి దాకా నిరోధించ గలిగిన వేణు అశ్రుధారలు యిక ఆగలేదు. అశ్రుధారల మధ్యే ఆమె జట్కా బండి వానికి ఏదో పురమాయించటం గూడా గమనించాడు. ఇంకో అర గంటలో అనాధగా పడివున్న ఒక మహాభోగికి, ఒక మహా త్యాగికి శవ సంస్కరణ వస్తుసముదాయం ఆ బండిలోనే వచ్చి చేరాయి.

నాన్నగారి శవంలో అందం తగ్గలేదు. అలసట మాత్రమే కన్పిం చింది. అంత అందగాడు అడవి కట్టెల్లో అదృశ్యమై పోవటమూ గమ నించాడు - వేణుమాధవ్ అనే బాలుడు. కాని అక్కడా ఒక పద్యమే స్ఫురిం చింది. తను నాలుగైదుసార్లన్నా చూసివున్న హరిశ్చంద్ర నాటకంలో కాటి సీనులో పద్యం - "చతురంభోదిపరీత — భూవలయం —" పద్యం, పాట. ఆ స్మశాన ధాత్రిలో — భయం వేయటం లేదు, కల్యాణ మంగళ వాద్యా ల్లాగా పలుకుతున్నవి. విషాదాన్ని వెనక్కితోసి, వయస్సును అధిగమించి - తన ఆలోచనలు.

స్మశానవాటి నుండి తిరిగి వచ్చాడు. జట్కాబండిలో ఆమె వేచి వున్నది. తనను పిలిపింది - నీలంగా, నిరాశలాగా. అమ్మతమ్ముడు తన మేనమామ వచ్చి తనను బరబరా లోనికి లాక్కుపోయాడు. జట్కా కదిలి పోవటం విన్నాడు.

ఎవరి పురమాయింపు లేకుండానే మర్నాడు బ్రాహ్మడు వచ్చాడు. ఇంట్లో అమ్మా తనూ, తన మీద భారం పడకుండా మామయ్యే గూడా జారు

కొన్నడాయెను. తను బ్రాహ్మడికెదురుగా కూర్చున్నాడు కరిమింగిన వెలగ పండులాంటి ఆ యింటి వరండాలో.

"దేవ మాతృక భూముల మీద వర్షించి జాడ తెలుపకుండా నడిచి పోయింది ఆ మేఘం - చల్లని తల్లి. నిత్యకర్మకు అన్ని ఏర్పాట్లు చేసి పోయింది. దిగులు పడకు నాయనా" అన్నాడు. అమ్మ చీదరించుకొన్న ఆ హనుమాయా?

"దేవ మాతృక భూములంటే....?"

"వర్షాధార భూములు నాయనా!"

నాన్నకు నిత్య కర్మ అలా నిర్విఘ్నంగా జరిగిపోయింది. తాతగారు పట్టుదలతో తనకు ఎనిమిదో ఏటనే వడుగుపోగు వేయించింది - ఇందుకేనేమో. ఆ సంరంభం గుర్తుకు వచ్చి యింకా గతంలోకి పోయి, మళ్ళీ వర్తమానానికి. తిరిగి యింకో పద్యంలయరాగం "కారేరాజులు రాజ్యముల్ - సేయరే?-" వారేరి? ఎక్కడ? నాన్నగారి నాటకాల హోలు.

## 3

హోవార్డ్ దొర యిచ్చిన బహుమానపు డబ్బుతో స్టేషను వైపుకు దారి తీశాడు. దాని వెనకనే సెకండ్ హేండు గుడ్డల మార్కెట్. పాత గుడ్డలకు మాసికలు వేసి, శుభ్రంగా వుతికి అవ్వలు - రిక్షావాళ్ళకు - హమాలీలకు, బిచ్చగాళ్ళకు అమ్ముతుంటారు. ఒక పైజమా, ఒక చొక్కా, ఒక ప్యాంట్. ఆ పక్కనే పాత చెప్పుల బేరం. జేబులో యింకొంత డబ్బుంది. మంగలి షాపులో తలపని. మైదానం అంచున బావి ముందు స్నానం. ఒళ్ళు ఆరిందాకా ఎండలో శవాసనం. మెరిసిపోతున్నాను అనుకొన్నాడు వేణు. నాన్నగారి రంగు. తాతగారి పొడుగు. ఆఫీసులకు టిఫిన్ కారియర్లు, భోజనపు డబ్బాలు మోసుకెళ్ళి, మిగిలిన అన్నాన్ని పదార్థాల్ని ముద్దలు చేసి, పేవ మెంటు చెట్టుకింద - సాంబారుతో అమ్మే స్త్రీల గుంపుముందు తన స్ఫుర ద్రూపంతో నిలబడి వున్నపుడు, వాళ్ళు కొంత ఆశ్చర్యంతో అనుమానంతో తిలకించినపుడు - మళ్ళీ గతంలోకి.

"ముద్ద ఆరణాలు" అన్నది ముసలమ్మ.

దోసిట్లో అరటి ఆకు. కళ్ళు మూసుకు తిన్నాడు. సత్తుగ్లాసు నీటితో కడుపు నిండింది. తాతగారి కనకధారా స్తవమ్ అనాలోచితంగా, ఏ ప్రయాస లేకుండా ఆసాంతం జ్ఞాపకమొచ్చింది. పొద్దుట పాత గుడ్డలు కొంటూన్నప్పుడూ

అంతే. గతం. తన చొక్కాల్ని లాగూల్ని తాతగారు పేద పిల్లల తల్లులకు దానం చేయటం. ఎంగిలి ముద్ద తింటూన్నప్పుడు - తాతగారి కాశీయాత్ర సమారాధన.

భోజన కాలే భగవన్నామస్మరణ - గోవిందా - సర్వకుల సమారాధన వేయి మంది. వంట మనిషి శివయ్య వేపుడు కూరలు. తన కిష్టమైన బొబ్బట్లు - ఇంట్లో

మనిషికి తిండీ బట్టా ఏర్పడినాయ్. చీకటి పడ్డది. బారకాసు రోడ్డు దాటితే, తన మూడు రోజుల వుపవాసం ముందు చేసిన వుద్యోగం - యిల్లు వస్తుంది. పీర్లసావిడి చపుడు తన గుడ్డల్ని మైలచేస్తుంది. పదిసార్లు తిరిగాడు అటూ, ఇటూ. "ఇచ్చట శాస్త్రీయ సంగీతం నేర్పబడును" - బోర్డు కనిపించలేదు.

వెనక నుంచి పిలుపు. గాజుల గల గల,

"బాబూ - ఓ బాబూ. -"

ఆగిపోయి తిరిగి చూశాడు. స్త్రీ. యువతి. పొడుగ్గా వుంది. దృఢంగా వుంది. నొసటన చీకట్లో మెరిసే బొట్టు. తల్లో మల్లెలు. "కావాలా?" అంటున్నది - నవ్వుతూ.

"కావాలి - వుద్యోగం కోసం -"

చెయ్యి పట్టుకొన్నది. తను వెనక్కు తీసుకొన్నాడు. తన కళ్ళల్లో కళ్ళుంచి చూసింది. "రా" - అన్నది. అట్లా ఏర్పడింది వ్యభిచారిణి, వేశ్యలాంటి వనిత, ఏలూరు మణితో - రెండు నెలల పరిచయం.

వరసలో గుడిశెలు కొంత మురికివాడ, దాటి పెద్ద తాటాకుల కొంపలోకి తీసుకెళ్ళింది. రెండు గదులు. ఎంతో శుభ్రత. ఒక గదిలో వంట పాత్రలు తళ తళ లాడుతూ. రెండో గదిలో ఒక మంచం. కడప ముందు చిరుచాప. ఎనిమిదేళ్ళ పాప. దీపం ముందు పుస్తకం వేసుకొని చదువుతున్నది.

"మా పాపకు పాఠాలు చెప్పు" అని తన్నక్కడ కూలేసింది. "మళ్ళీ వస్తా" - అంటూ పోబోతూ, "తిన్నావా?" అని ప్రశ్నించింది.

"ఆ"

"సరేలే. వస్తూ ఏవైనా తెస్తాను".

ఆ పిల్లవి చాలా పెద్ద కళ్లు. అమాయకంగా తన వేపే చూస్తున్నది. "ఏం పాఠం చెప్పను?" అన్నాడు.

"పద్యం"

అమ్మయ్య - బతికి పోయాను. ఇంగ్లీషు పాఠం అసలేదు. అందులో తను ఎనిమిదో తరగతి పట్టభద్రుడు. కాని తెలుగు అట్లాకాదు. సమాసాలు విడదీయగలడు. ప్రతిపదార్థం చెప్పగలడు, తాత్పర్యం వివరించగలడు. తాత గారి పుణ్యం. ఆపదోద్ధారక స్తోత్రం, కాళహస్తీశ్వర శతకం, బాల రామాయణం. ఇది మాత్రం లీల కాదా?

పోతన్నగారి భాగవత పద్యం. సాత్వికత. ఆత్మార్పణ. నిరామయత. కేవల భక్తి. "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు" వ్యాకరణంతో సహా చెప్పాడు.

ఆ పిల్లకు నిద్ర తూలుతున్నది. తల్లి రాలేదు.

"పేరేమిటమ్మా?"

"పద్మ -"

వేణుకు శరీరం స్వల్పంగా కంపించినట్లయింది. హనుమాయి కూతురు పేరూ పద్మే. పంకిలంలో పుట్టిన వాళ్ళా యీ పద్మాలు? అనుకుంటూ మంచం మీది చిన్న దిండును పద్మ తల కింద అమర్చాడు. బయట అడుగుల సవ్వడి.

"పద్మా - మీ అమ్మ రాదే - ఠాణాలో వుంది. అన్నం తెచ్చా తినవే" - అంటూ ఒక స్త్రీ ప్రవేశం చూశాడు. అదే ఆకారం. మెరిసే తిలకం. తలలో బొండు మల్లెల చెండు. తన్ను ఎగాదిగా చూసింది - పరిచయం వున్నట్లే.

"నీకూ తెచ్చాను"

పిల్లను లేపింది. కంచంలో చేపల పులుసు.

దొండకాయ యిగురు. తనకూ యింకో కంచం - కంచు కంచం - వడ్డిస్తున్నది. "వద్దు -" అన్నాడు.

"తిను తిను - మైలపడవులే పెద్దమనిషీ - రాజుల హోటేలు వంట'.

మజ్జిగన్నం కలుపుకొని యిగురు నంజుకుంటూ తనూ కొంచెం తిన్నాడు. తన పేరు గొల్లప్రోలు రాధ అని చెప్పింది. దీపం తగ్గిస్తూ - "ఆ మంచం మీద పడుకో - మణి చెప్పిందిలే. రేపట్నించీ మా పాపలిద్దర్నీ పంపుతాగా. బాగా చెప్పు. జీతం యిస్తాం. అందరికన్నా ఎక్కువే యిస్తాం" అంటూనే పాప పక్క చిరుచాప మీద తనూ వరిగిపోయింది. నిశ్శబ్దం. మళ్లీ తనూ, తన ఆలోచనలూ.

తన కథకూ, కన్నీళ్ళకూ ఎంతో బంధం. కాని కన్నీళ్ళను వేరుచేయ గలుగుతున్నాడు. తన గాథకూ గతానికి మాత్రం అనుబంధం. విడదీయ

లేకున్నాడు. ఈ రాధ ఏమీ సంకోచం లేకుండా, నిర్భయంగా - ఆ గదిలో తను పరాయివాడినన్న ఆత్రుత విడిచి పడుకొన్నది. తనకా? అన్నీ సంకోచాలే. వివిధ వేదనల వాయులీనం తన అంతః శృతి. జ్ఞాపకాలు శాపాలు. గతం హుతం కాదు.

ఆలోచనాగ్నిని చల్లార్చటానికి ఏదో చేయాలి. గొల్లప్రోలు రాధ మేలుకొనే వుంది. "నువ్వు - మీరు - తిన్నారా?" అని ప్రశ్నించాడు.

"గాంధీగారు వుపాసం చేస్తుంటే, మీ మగాళ్ళు చెడ్డతిళ్ళు తింటున్నారు. నాకు మనసొప్పలేదు. ఆయన చచ్చిపోతే యింకేమున్నా వుందా?" అని ఎదురు ప్రశ్న వేసింది.

వేణు అవాక్కయి పోయాడు. తననెంత తేలిగ్గా నమ్మిందో, జీవితంలో లోకంలో గంభీర సత్యాల్ని అంతగా అర్థం చేసుకొన్నదా? దిన చర్యగా ఎందరో విటుల్తో నటిస్తూ తను వేరే జీవితం జీవిస్తున్నది. ఈ విటుల మన స్తత్వం అద్దంలో చదువ గలదనిపించింది. కలత నిద్ర - హుతం కాని గతం. నిశీధి రాత్రిలో పలవరింతలు కాబోలు. రాధ తన మంచం మీద కూర్చొని తల పట్టుకొని వూపుతున్నది. స్త్రీ సంపర్కంతో తనకు అనుభూతి లేదు. పరాయి స్త్రీ స్పర్శ సుఖం గూడా తను ఎరగడు. ఆమెను గట్టిగా చుట్టి వేసుకొన్నాడు. రాధ తన వేపు నిమురుతూ కన్నీరు తుడుస్తున్నది. గాంధీజీ వుపవాసం - .

తెల్లవారి, ఏలూరు మణి, చేతిలో ఇడ్లీ పొట్లాంతో ప్రత్యక్షమయిందాకా, తనను లేపిందాకా...యింకో లోకంలోనే వున్నాడు.

## 4

తాతగారికి నాన్న దత్తపుత్రుడు. దత్తతలోనే కొత్తపేరు- కళాధర్ అని. తాతయ్య శివభక్తులు. నాన్నకు చక్కని గాత్రం. రెండూ కలిసివచ్చే నామం. దత్తపుత్రుడు నాటకాల ప్రోత్రుడు. రాజపోషకుడు. పెత్తనం చేతికి రాగానే కళాధర్ హాల్ అనే నాటకశాల వెలిసింది. తాతగారు ఉప్పు సత్యాగ్రహంలో జైలుకు పోయిం తర్వాత పూర్తి పెత్తనం నాన్నగారి కైవసం. ప్రతి వారం కొత్త నాటకం. లాభనష్టాల్తో ప్రమేయంలేదు. ఐదారేళ్ళు తనఖా దస్తావేజులు, ఆపైన విక్రయ దస్తావేజులు. సరివీతోపులు, మామిడితోట, మాగాణి భూములు - ఒక్కటొక్కటే పరహస్తగతం అవుతున్నా, స్వగ్రామం

పొలిమేరలు తొక్కకుండానే నాన్నగారు విక్రయ సంతకాలు పెడ్తున్నా నాట కాలు ఆగలేదు. ఆర్థిక మాంద్యం రోజులు. ఎస్టేటు దివాలా తీస్తున్నది. గాడి బావి వీధిలో మార్వాడీలు — ఇంటినీ, కళాధర్ హాలునూ తనఖా పెట్టుకొని సమయం కోసం వేచివున్నారని — వేణు అనే అర్భకుడికేం తెలుస్తుంది? హేమా హేమీ నటీనటకులు — పాండవోద్యోగ విజయాలు, కురుక్షేత్రం, గయో పాఖ్యానం, రోషనారా, రాజపుత్ర విజయం, నలదమయంతి, విప్రనారాయణ — నాటకాల్లో పద్యాలు, పాటలు వినిపిస్తుంటే — ఈ వ్యవహారాల్తో తనకేం పని? తను పాటల మధ్య పద్యాల మధ్య కవితల ప్రమేయంతోనే కడుపు నింపుకుంటున్నాడు. పుట్టినరోజు పండగలు జరుపు కొంటున్నాడు. జైలు నుంచి వచ్చిన తాతయ్య ఆధ్యాత్మికతను అచేతన చైతన్యంతో పరికిస్తు న్నాడు. ప్రతి నాటకానికీ తను హాజరు కావాల్సిందే. ఆ వూళ్ళో సగం జనా నికి టిక్కెట్లు కొనే బెడద లేదు. నాన్నగారి పేరు చెప్పి లోపలికి దూసుకు పోవటమే.

ఒక రాత్రి తను సారంగధర నాటకానికి బయలుదేరుతుంటే అమ్మ వద్దన్నది. తను పోకుండా కాపలా కాచింది. కోప్పడ్డది. చదువుకో అన్నది. మరునాడు వెంకట్రావు భాగవతార్ భార్య సీతమ్మ తనను బడికి పోతుంటే ఆపి — "స్థానం ఆయన రాకపోతే మీ పిన్ని హనుమాయి చిత్రాంగి వేషం బాగా వేసిందట, నిజమేనా?" అని అడిగింది. సీతమ్మ ఆడనారదుడనీ, పెట్టిన చేతిని కరిచే కుక్క అని తనకెట్టా తెలుస్తుంది? అట్లా హనుమాయి పేరు మొదట విన్నాడు. ఆ తర్వాత అమ్మ వద్దంటున్నా విప్రనారాయణ తిలకిం చాడు. అందులో దేవదేవి వేషం ఆమెది. బాగా వేసిందని తాతగారితో ముచ్చ టిస్తే తన్ను పరీక్షగా చూసి మౌనముద్రతో వుండిపోయారు. కుళ్ళుబోతు సీతమ్మ — అమ్మని పొగిడి ఆధరువులు వేసుకుంటూ, హనుమాయికి నాన్నకు వున్న సంబంధం గురించి విపులంగా చెపుతుంటే విన్నాడేగాని అందులో అసంబద్ధం చూడలేదు. అమ్మ శివయ్యను నిలదీసి అడగటం, ఆ తర్వాత యింట్లో అమ్మకూ నాన్నకూ చిన్న చిన్న కలహాలు — అవి గూడా వేణుకు అంతుబట్టలేదు.

కళాధర్ హాలు మూతబడ్డ తర్వాత నాన్నగారు యిల్లు కదిలే వాడు గాదు. అప్పుల వాళ్ళు వచ్చి గుసగుసలుగా ఆయనతో సంప్రదింపులు జరుపు తున్నపుడు, తాతగారు లోనికి పోయి పూజ గదిలో కూర్చునేవారు. అటకల

మీది ట్రంకు పెట్టెల్లో వెండి సామాను, బొమ్మపాత బంగారు పట్టెడలు, కాసుల పేర్లు, వడ్డాణాలు, చేతివంకెరలు, గట్టి గాజుల జతలు, తాతగారి మురుగులు, చివరికి శాలువాలు, నాటకాల కిరీటాలు, నగిషీ ముఖమల్ దుస్తులు, పెద్ద మంచాలు – అన్నీ చీకటి పడ్డాక ఒక్కొక్కటి వెలికి పోతూన్నప్పుడూ తాత గారు పట్టించుకొనేవాడు గాదు. తను మాత్రం హార్మోనీ పెట్టెను దాచు కొన్నాడు. వేణు తన పేరు. తబలా సెట్లు కనిపించక అవిగూడా పోయినవని తెలిసి దుఃఖం తెచ్చుకొని తాతగారి ముందు కన్నీళ్ళు పెట్టుకొంటే – ఆయన తనను నడిపించుకొంటూ వీధిలో బజార్ల కూడలికి తీసుకుపోయి "అటు చూడు"అన్నాడు. అక్కడ కళాధర్ హాలు స్థలంలో, మార్వాడీల నగల దుకాణాలకు మేడ లేస్తుండటం చూసి, మౌనంగా పరాజితుడై పరాభవుడై తిరిగి వచ్చాడు.

కొద్ది నెలల్లోనే తాతగారి మహాప్రస్థానం. పండగ్గా ఆయన చావు. ఆ రోజు నాయనమ్మ తద్దినం. నాన్నగారు లేరు. తనే అపరాహ్ణవేళకు తద్దిన కర్మ జరిపించాడు. బ్రాహ్మణ భోక్తలకు తాంబూల సంభావనలిచ్చాడు. తనను పిలిచాడు.

"దిగులు పడకు. బతకటం నేర్చుకో" అన్నారు. అంతే.

తాతగారితో జైల్లో వున్నవాళ్ళు, పండితులు, పామరులు, గుడిపూజారులు, వైష్ణవార్చకులు - ఎవరెవరో తాతగారి శవయాత్రలో పాల్గొన్నారు. ఇంటిని తాకట్టు పెట్టుకొన్న మార్వాడీలే నాన్నగారికి ఖర్చుల కోసం పైకం యిచ్చిపోయారు. "మహానుభావుడు, దానకర్ణుడు, భీష్మలవారివలె ఐచ్ఛిక మరణం పొందిన పుణ్యాత్ముడు" అని అందరూ చెబుతుంటే విన్నాడు. తాత గారు అంతకన్నా గొప్ప మనిషి అని మాత్రం తను అనుకొన్నాడు. మరణం గురించిన ప్రథమ ప్రతిశృతి వేణు హృదిలో ధ్వనించింది. దిగులే కాని అర్థం తెలియలేదు. రాత్రి తాతగారి పద్యాల్ని రాగయుక్తంగా పాడుకోవాలనిపించి హార్మోని పెట్టె ముందు కూర్చొన్నాడు. అమ్మ వచ్చి కళ్ళురిమి చూచింది. నాదం నిలిచిపోయింది. తను బయటకు పోయి ఆకసం వంక చూశాడు. పైన తారలు లేవు. కింద తీరం తెలియని మహాప్రవాహం ఆ చీకటి.

అప్పుడప్పుడు - నాన్నగారికి మనీ ఆర్డర్లు వస్తూండేవి. అవి వచ్చిన దినాన యింట్లో రాద్ధాంతం. హనుమాయి పంపుతున్నదని అమ్మకు తెలుసు. నాన్నగారు విసుక్కొని తన స్నేహితుడు డాక్టరు వరదయ్యగారింట్లో కాల క్షేపానికి వెళ్ళిపోయేవాడు.

ఆ రోజున వుదయం - తనను నిద్రలేపింది. - ఎన్నడూ లేనిది. ముఖ ప్రక్షాళన చేయించింది. తాతగారి కాశ్మీరు శాలువ కప్పింది. అదొక్కటే విలువ గల వస్త్రం మిగిలింది యింట్లో. తాతగారి కాశీ చెంబు - హరిదాసులు తలమీద అవలీలగా పెట్టుకొనే సైజులో వుంటుంది - తెచ్చి శాలువా కింద పెట్టి - "అప్పమ్మ గారింటికి పోయిరా. నువ్వేమీ అడగొద్దు. ఈ చెంబు ఆమెకియ్యి" అన్నది.

"యాయవారానికి పొమ్మంటున్నావా?" అన్నాడు తను.

"కాదురా దరిద్రుడా - నువ్వెళ్ళు"

తను మొండికేశాడు. వాగ్వాదం జరుగుతూండగా నాన్న బయటకు వచ్చాడు. తన చెంప మీద బలంగా రెండు దెబ్బలు కొట్టాడు. నాన్నగారు అంతకోపంగా తనను కొట్టటం అదే మొదటి సారి. అదే చివరిసారి అని మరు నాడు గాని తనకు అనుభవం కాలేదు.

అమ్మ అడ్డం వచ్చింది. "చేసిన నిర్వాకం చాలు, వాణ్ణెందుకు కొడ్తారు. మీ హనుమాయి కూతురు పద్మను యిట్లాగే కొడ్తారా?" అని శోకదేవతలాగా పరుషంగా మాట్లాడింది. నాన్న జవాబు చెప్పలేదు. ఆ మధ్యాహ్నమే వర దయ్య డాక్టరు గారింటికి కాబోలు వెళ్ళిపోయారు. బాపట్లకెందుకు పోయారో తెలియదు. మరునాడు వుదయం - నిదుర గన్నేరు శాంతంతో ఆయన శవం వచ్చింది. అవును, నాన్న తనను దండించటం అదే మొదటిసారి. చివరిసారి.

## 5

ఈ పదేళ్ళలోనూ వేణు తిరగని వూరులేదు. చేయని వుద్యోగం లేదు. పెట్రోలు బంకుల్లో, హోటళ్ళలో, బియ్యం మిల్లుల్లో, మధ్యమధ్య శాస్త్రీయ సంగీత సాధనకు రామక్రిష్ణయ్యగారి శిష్యత్వం. కాని గతాన్ని తుడిచేస్తున్నా ననే తృప్తి అసంతృప్తే అని గ్రహిస్తున్నాడు. తాతగారి చావుకు నాన్న, నాన్నగారి నిర్గమనానికి అమ్మ, అమ్మ మరణానికి తనూ బాధ్యులం కామా? తెగని మీమాంసం. తరగని మనో చర్చ.

మూడురోజుల వుపవాస వ్రతం ముందు చేసిన నెల రోజుల తాత్కాలిక వుద్యోగంలో అతనికో వింత వ్యక్తి తటస్థించాడు. రోజూ రెండు పూటలా నిశ్శబ్దంగా ఆయనకు హోటేల్‌నుంచి అన్నం కారియర్ తీసుకెళ్ళాలి. ప్రశ్నలు వేయకూడదు. ఎవరికని ప్రశ్న వస్తే సంగీతం మాస్టారుకని చెప్పాలి. తర్వాత తెలిసింది - ఆయన అండర్ గ్రౌండ్‌లో (రహస్య జీవసం) వున్న కమ్యూనిస్టు

నాయకుడు రామలింగయ్యగారని. ఆయన తనకు హోమియోపతి మందు లిచ్చేవాడు. తీరిక వున్నప్పుడు తన సంగీతం వినేవాడు. తనకు ఇంగ్లీషు రాదని చెబితే అది పెద్ద లోపంకాదని కొట్టేసేవాడు. క్రమక్రమంగా తన జీవిత విశేషాలన్నీ చెప్పించుకొన్నాడు. ప్రతి విషయాన్నీ విశ్లేషించి చెప్పే వాడు. "మీది భూస్వామ్య కుటుంబం- మీవాళ్ళ సాంస్కృతిక జీవనంలో వచ్చిన కలతలు క్లేశాలు - అన్నీ భూస్వామ్య నాగరికత పతనావస్థను సూచిస్తున్నాయ్" అనేవాడు. తనకర్థం కాలేదు.

అప్పటికి యుద్ధం వచ్చింది. యుద్ధాన్ని గురించి సామ్రాజ్యవాద విస్తరణ గురించి, భవిష్యత్తులో సోషలిజం గురించి ఎన్నో వివరణలిచ్చాడు. "నీవంటి కష్టజీవులందరూ మా పార్టీని బలపరచాలి" అనేవాడు. తన తెలుగు భాషా ప్రవేశాన్ని ప్రశంసించేవాడు. "వ్రాయి. నీ ఆలోచనలన్నీ రాతలో పెట్టు. నీ తర్కం వికసిస్తుంది" అనేవాడు. తన పాటలూ, పద్యాలూ? అవీ వ్రాయి. కాని ప్రజల భాషలో - అని వీపు తట్టాడు. దినపత్రిక తప్పక చదవాలని వుద్బోధించాడు. మహాత్మాగాంధీకి తమకూ ఏయే విషయాల్లో ఏకీభావం వుందో, ఏవేవి విభేదాలో గూడా తెలియజేశాడు. వినోబాభావే వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభమైంది. బ్రిటిష్ వ్యతిరేక యుద్ధ నినాదాలు వేఖు విన్నాడు. కాని మరునాడు ఆ గదికి వెళ్ళినపుడు రామలింగయ్యగారు అంతర్ధానమైనాడు. తనకు జీతం కింద పది రూపాయలు గదిలో వుంచి పోయాడు.

విశాఖ నగరం మీద బాంబులు వేసి జపానువాడు నగరాన్ని ధ్వంసం చేస్తాడని పుకార్లు - ఏలూరు మణి, గొల్లప్రోలు రాధ - విశాఖ వాసుల్తో కలిసి - ఎక్కడికో వలస పోయారు- తనకా ట్యూషన్ల వుద్యోగమూ పోయింది. పోతూ పోతూ పద్మ చేత తనకు గుడ్డలు పెట్టించింది మణి. రాధ ముప్పయి రూపాయ లిచ్చింది.

అయితే తనకు పదే పదే స్మృతికి వచ్చే మాటల్లో ప్రధానమైనవి- హనుమాయిని గురించి, ఆమె బిడ్డ పద్మను గురించినవి. "నీ హీన సంస్కృతిలో హనుమాయిని మీ నాన్న వుంపుడుకత్తె అనుకొంటున్నావు. కాదు- అమె మీ నాన్న రెండవ భార్య. నీకు సవతి తల్లి లేక పినతల్లి. పద్మ మీ నాన్నకు జన్మించినదే. నీ చెల్లెలు''. అయితే, ఆ కుళ్ళుబోతు సీతమ్మ మాటల్లో గూడా యింత నిగూడార్థం వుందా? అని మొదటిసారి ఆవిష్కరించుకున్నాడు.

''వాళ్లు బ్రతికుండగా నువ్వు ఒంటరివాడివెట్లా అవుతావ్? మీ నాన్నను మరణాంతరం గూడా గౌరవించిన వనిత నీకు పరాయిదెట్లా అవుతుంది?'' అని రామలింగయ్యగారి విశ్లేషణ వంట బట్టినట్లుగా వుంది.

ఏలూరు మణిగుడిసెలోనే తన రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టాడు. ఒక విప్లవకారుడి ప్రేరణ: ఒక వ్యభిచారిణి ఆదరణ: ఒక అనామకుడి రచన: ఆరు నెలల శ్రమ. తన అన్వేషణకు అడ్డుగా ఆకలి, యితర అవరోధాలు. మధ్య మధ్య వుద్యోగాల బదిలీల్లాంటి మార్పులు .కాని పూర్తిచేశాడు. కొట్టివేతలు, కత్తిరింపులూ, మార్పులూ, చేర్పులూ, మరణం మీద మీమాంసలు, మానవత పలకరింపులు-హొవార్డు దొరతో సహా రహస్య పత్రిక స్వతంత్ర భారత్ తో సహా. నవలిక పేరు "సవతి చెల్లెలు". అంకితం తాతగారికి, నాన్నకూ, అమ్మకూ. నీలాంబరి రాగం హనుమాయి పిన్నికీ.

ఈ లోపల వేణుకు చాలా సారస్వత పరిచయాలేర్పడ్డాయి. మకాం మద్రాసుకు మారింది. సంగీత సభలు. తమిళం తెలియక పోయినా చర్చలు, జన్యజనకరాగాల్లో భిన్నత్వాలు వింటూండేవాడు. బ్రహ్మానందరావు పరిచయం అక్కడే. మసూనాతో స్నేహబాంధవ్యం గూడా. మంగపతి-గ్రామఫోను కంపెనీ డైరెక్టరుకు తనను గురించి గొప్పగా చెప్పినవాడూ ఆ మిత్రుడే. అప్పటికి తను ఒక తెలుగు సినిమాలో బిచ్చగాళ్ళ భజనపాట కోరస్‌లో గొంతునిచ్చి వున్నాడు.

మంగపతిగారు-ఆ పాట విన్న తర్వాత ''మా కంపెనీలో ఆడిషన్ యివ్వు. మా సంగీత దర్శకురాలున్నది. లోపాలుంటే సవరిస్తుంది. చాలా మంచి వ్యక్తి'' అని వుత్తరం వ్రాసి యివ్వటం రెండవసారి కలిసినప్పుడే.

భుజాన సంచీలో తన నవలిక. తన నీలాంబరిరాగం పాటలు. ఆడిషన్ గదిలో టెన్షన్‌తో మసూనా సరసన కూర్చొన్నాడు. అయిదు నిమిషాల్లో పిలుపువచ్చింది. వేణు తబ్బిబ్బుయిపోయాడు. చెంపలు తెల్లబడ్డా, ముఖంలో ఆవేదనా, శాంతీ కలబోసినట్లున్నా-ఆమెను గుర్తించాడు. హనుమాయి తన పేరు అడిగింది. ఎగా దిగా చూసి తన వూరు పేరడిగింది. చెప్పగానే సంభ్రమంతో లేచి తనను చుట్టివేసుకొంది, ఆనంద భాష్పం తన చెంపమీద.

"నీకోసం ఎక్కడెక్కడ వెతకలేదు? ఇప్పటికి నేను గుర్తుకొచ్చానా వేణూ..." అంటున్నది.

మిత్రుడు- మసూనా తన నవలిక చదివి వున్నాడు. అర్థం చేసుకొన్నాడు కాబోలు చప్పుడు లేకుండా జారుకొన్నాడు.

నీలాంబరిరాగ మేఘమాలికలు చుట్టి వేస్తున్నాయ్. వేణు. తను. తాతగారి అంతిమకోరిక. నాన్నగారి ప్రేమకానుక. స్త్రీ సహజమైన అమ్మ అసూయలో అమాయకత్వపు రాక్షసత. తన పుస్తకం, తనగాధా, తన గానం, గాత్రం, తన అన్వేషణ. ఈ బ్రతుకుకు అర్థం వుంది. నీలాంబరి రాగమ్. బ్రతుకు పాట. మనిషి బాట. వేణు రోదిస్తున్నాడు-సవతి తల్లితో కలిసి. అది గూడా పాటే!

రచన సచిత్ర మాస పత్రిక
ఉగాది మే 92